క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో చండీ హోమం



ఎంపీపీ చంద్రమోహన్‌రెడ్డికి ప్రసాదం అందిస్తున్న దామినేటి కేశవులు

తిరుపతి రూరల్ : పేరూరు పంచాయతీ పరిధిలోని అగ్రికల్చర్ స్టాఫ్ క్వార్టర్స్ వద్ద కరుమారియమ్మ నాగాలమ్మ ఆలయంలో మంగళవారం అత్యంత భక్తిశ్రద్ధలతో చండీ హోమం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త దామినేటి కేశవులు ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అమ్మవారిని ఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డి సేవించుకున్నారు.

వంశీకృష్ణకు సేవా పురస్కారం



అవార్డు అందుకుంటున్న వంశీకృష్ణ

తిరుపతి తుడా : అంకుర ఆస్పత్రి చిన్నపిల్లల వైద్య నిపుణుడు అనుప వంశీకృష్ణకు హెల్త్ కేర్ పర్సనాలిటీ ఆఫ్ ద ఇయర్ పీడియాట్రిక్స్ ఉత్తమ సేవా అవార్డు లభించింది. ఈ మేరకు న్యూఢిల్లీకి చెందిన ఆసియా టుడే మీడియా ప్రైవేట్ లిమిటెడ్ సోమవారం లండన్ పార్లమెంట్‌లో అవార్డును అందించింది. వంశీకృష్ణను సంస్థ వైస్ ప్రెసిడెంట్ వీఎస్ ప్రసాద్ అభినందించారు.

శ్రావణ్ కుమార్‌కు డాక్టరేట్



తిరుపతి సిటీ : శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ వాటంబేడు శ్రావణ్ కుమార్‌కు తమిళనాడు చిదంబరంలోని అన్నామలై వర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. అధ్యాపకులు కె.ఇళంగోవన్, సి.నాగేశ్వరనాథ్ పర్యవేక్షణలో ప్రొపగేషన్ ఆఫ్ వేవ్స్ ఇన్ ట్రాన్స్‌ఫరెన్సీ ఐసోట్రోపిక్ పోరోఈలాస్టిక్ సాలిడ్స్ అనే అంశంపై ఆయన పరిశోధన పత్రాలు సమర్పించారు.

అమ్మవారికి వెండి నాగ హారతి



వెండి నాగహారతిని అందిస్తున్న దాతలు

చంద్రగిరి : పట్టణంలోని పాతపేటలో వెలసిన శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి మంగళవారం దాతలు గుణశేఖర్‌శెట్టి దంపతులు రూ.35వేల విలువైన వెండి నాగ హారతిని విరాళంగా అందజేశారు. దాతలకు నిర్వాహకులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.


7న విజయవాడలో టీచర్ల ధర్నా



పోస్టర్ విడుదల చేస్తున్న ఫ్యాప్టో నేతలు

తిరుపతి సిటీ : సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయుల ఈ నెల 7వ తేదీన విజయవాడలో ధర్నా చేపట్టనున్నట్లు ఫ్యాప్టో చైర్మన్ సురేష్ తెలిపారు. మంగళవారం నగరంలోని ఎస్టీయూ భవన్‌లో ఫ్యాప్టో సమావేశం నిర్వహించారు. ఫ్యాప్టో కార్యవర్గ సభ్యుడు రమేష్ మాట్లాడుతూ ధర్నాకు పెద్దసంఖ్యలో ఉపాధ్యాయులు తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం ధర్నా పోస్టర్ విడుదల చేశారు. నేతలు వెంకట్రావు, మురళీకృష్ణ, రామచంద్రయ్య జగన్నాథం, బాలసుబ్రమణ్యం, ముత్యాల రెడ్డి, లక్ష్మయ్య, వాసు, రవీంద్ర, సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఎస్‌ఐ మహబూబ్‌బాషా

తిరుపతి అర్బన్: ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అందరికీ అవగాహన అవసరమని ఈస్ట్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ మహబూబ్ బాషా తెలిపారు. మంగళవారం పోస్టల్ కాలనీ పరిధిలోని ఉప్పంకి ఎస్సీ కాలనీలో ప్రాథమిక పాఠశాల వద్ద పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా స్థానికులతో సమావేశమయ్యారు. ఎస్‌ఐ మాట్లాడుతూ చట్టాలని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డీటీ రామచంద్రయ్య మాట్లాడుతూ స్థానిక సమస్యలపై అర్జీలు అందిస్తే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. సోషల్ వెల్ఫేర్ అధికారి లోకనాథంరెడ్డి, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు వాల్ ముని పాల్గొన్నారు.

ప్రభల తేజం!



సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న శ్రీమలయప్పస్వామివారు

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలను కనులపండువగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం ఉదయం శ్రీమలయప్పస్వామి వారు సూర్యప్రభ వాహనంపై ఊరేగారు. పరమపావన దివ్యచరణాలను స్పృశించిన భానుడిని అనుగ్రహించారు. రాత్రి తిరుగిరుల ఆహ్లాదకర వాతావరణంలో చంద్రప్రభ వాహనంపై విహరించారు. అశేషంగా తరలించ్చిన భక్తకోటిని కటాక్షించారు. దేవదేవుని వాహన సేవలను పురస్కరించుకుని కళాకారులు అద్భుతంగా ఆధ్యాత్మిక రూపాలను ప్రదర్శించారు. వైకుంఠనాథుని వైభవానికి సరికొత్త సొబగులు తీసుకువచ్చారు.

– తిరుమల





వాహన సేవలో కళాబృందాల ప్రదర్శన







ఆధ్యాత్మిక కళారూపాలు

విద్యార్థుల సంక్షేమానికే ప్రాధాన్యం



మాట్లాడుతున్న రామ్మోహన్

తిరుపతి కల్చరల్ : విద్యార్థుల సంక్షేమానికే విద్యార్థి సంఘాలు ప్రాధాన్యమివ్వాలని, సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు తెలిపారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర 25వ మహాసభ ఆహ్వాన సంఘం ఏర్పాటు సమావేశం మంగళవారం వేమన విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఎస్‌ఎఫ్‌ఐ నేతలు విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్నారన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామ్మోహన్, ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ఎస్‌ఎఫ్‌ఐ మహాసభ తిరుపతిలో జరగడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర మహాసభ ఆహ్వాన కమిటీని ఏర్పాటు చేశారు. సంఘం గౌరవాధ్యక్షుడుగా టింకాల దామోదరం, అధ్యక్షుడిగా ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా భగత్‌రవి, కోశాధికారిగా అక్బర్, గౌరవ సలహాదారులుగా విశ్వనాథ్‌రెడ్డి, తిప్పారెడ్డి ,చీఫ్ ప్యాట్రిన్స్‌గా అప్సా రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రమణ్యం రాజు నియమితులయ్యారు. నేతలు భగవాన్ నాగరాజు, వినోద్, అశోక్, వీరేష్, నరసన్న పాల్గొన్నారు.

తూతూమంత్రంగా హామీల అమలు



సమావేశంలో మాట్లాడుతున్న మస్తాన్‌బీ

తిరుపతి కల్చరల్ : కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను తూతూమంత్రంగా అమలు చేస్తోందని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు మస్తాన్‌బీ ఆరోపించారు. మంగళవారం పెద్దకాపు లేఅవుట్‌లోని యూటీఎఫ్ కార్యాలయంలో ఐద్వా జిల్లా మహాసభ నిర్వహించారు. మస్తాన్‌బీ మాట్లాడుతూ మహిళలపై లైంగిక దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అఘాయిత్యాలను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని విమర్శించారు. సూపర్ సిక్స్‌లో భాగంగా మహిళలకు నెలకు రూ.1500లు ఇస్తామన్న హామీ ఊసే లేదన్నారు. ఉచిత సిలిండర్లు కొద్ది మందికి మాత్రమే అందుతుండడంతో ఈ పథకం నీరుగారిపోయిందని విమర్శించారు. ఇక స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించినా కొన్ని బస్సులకు మాత్రమే పరిమితి చేశారన్నారు. మహిళలకు 12 గంటల పని విధానంపై అసెంబ్లీలో తీర్మానం చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. ఈ నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.జయంతి, పి.సాయిలక్ష్మి ,ఈశ్వరి, రాధమ్మ, సత్య, సుజాతమ్మ, చంద్రకళ, నాగమణి, లక్ష్మి పాల్గొన్నారు.

వైభవంగా నవరాత్రి ఉత్సవాలు







శాకాంబరిగా అమ్మవారు, ఊరేగుతున్న ఎల్లమ్మ, మహిషాసురమర్దినిగా చాముండేశ్వరి

తిరుపతి కల్చరల్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కొత్తవీధిలోని శ్రీకన్యకాపరమేశ్వరీదేవి మహిషాసుర మర్ధనిగా, మూల విరాట్ శాకాంబరి అలంకరణలో కటాక్షించారు. మంగళం రోడ్డులోని బొంతాలమ్మ ఆలయంలో అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు.

చంద్రగిరి: మూస్థాన ఎల్లమ్మదేవి శ్రీరాజరాజేశ్వరి అవతారంలో సింహవాహనంపై కొలువుదీరి భక్తులకు అభయమిచ్చారు. పురవీధుల్లో విహరిస్తూ భక్తుల నీరాజనాలు అందుకున్నారు. కొత్తపేట ఆర్‌ఎఫ్ రోడ్డులోని శ్యామలాంబ సమేత మల్లేశ్వరాలయంలో వెలసిన సంతోషి మాత చండీదేవి అవతారంలో దర్శనమిచ్చారు.

తిరుపతి రూరల్ : తుమ్మలగుంట క్రాస్ రోడ్డు ఎల్‌ఎస్ నగర్ వద్ద శక్తి చాముండేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారు మహిషాసురమర్ధినిగా కటాక్షించారు.

సంతృప్తికంగా అన్నప్రసాదాల పంపిణీ

తిరుమల : శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు సంతృప్తికరంగా అన్న ప్రసాదాలు పంపిణీ చేస్తున్నట్లు టీటీడీ అన్నప్రసాద విభాగం డిప్యూటీ ఈఓ రాజేంద్ర కుమార్ తెలిపారు. మంగళవారం తిరుమలలోని రామ్ భగీచా–2లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌లో అన్న ప్రసాద విభాగం ప్రత్యేక అధికారి జీఎల్‌ఎన్ శాస్త్రితో కలిసి ఆయన మాట్లాడారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ అన్నప్రసాదం, అల్పాహారం, పాలు, మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు దాతలు 23 రకాల కూరగాయలను విరాళంగా అందించారని వివరించారు. 29వ తేదీ వరకు 23,48,337 మంది భక్తులకు అన్న ప్రసాదాలు, 11,32,160 మందికి పానీయాలు అందించినట్లు తెలిపారు.

సారె సమర్పించి.. స్వామిని సేవించి!





సారె తీసుకువచ్చిన చంద్రగిరి మండలవాసులు, (ఇన్‌సెట్) ఊంజల సేవ నిర్వహిస్తున్న అర్చకులు

తుమ్మలగుంటలో శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ప్రతి రోజూ వాహనసేవలకు పది గ్రామాల ప్రజలు సారె సమర్పిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం ఉదయం సూర్యప్రభ వాహన సేవకు చంద్రగిరి, రెడ్డివారిపల్లె, నరసింగాపురం, రాయలపురంవాసులు సారె అందించారు. రాత్రి చంద్రప్రభ వాహన సేవకు రామచంద్రాపురం మండలం నెన్నూరు, నడవలూరు, సొరకాయలపాళెం, దేసూరికండ్రిగ, సి.రామాపురం, పీవీపురం, కమ్మకండ్రిగ, గంగిరెడ్డిపల్లె వాసులు సారె సమర్పించారు. వీరికి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డి సాదర స్వాగతం పలికారు. స్వామివారి దర్శన ఏర్పాట్లు చేశారు. – తిరుపతి రూరల్



సారెతో రామచంద్రాపురం మండల వాసులు



భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

నేటి వాహన సేవలు

తిరుమల : శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం పలు వాహనసేవలు నిర్వహించనున్నారు. ఉదయం 6.55 గంటలకు శ్రీమలయప్పస్వామివారు సర్వాలంకారభూషితులై ఉభయ దేవేరులతో కలిసి రథంపై ఊరేగనున్నారు. రాత్రి విశిష్ట అశ్వవాహనంపై మాడవీధుల్లో విహరించనున్నారు.

నోటీస్ బోర్డు

- ఎస్వీయూలో ఉదయం 10 గంటలకు నేషనల్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (నైలెట్) కేంద్రం ఆవిష్కరణ.
- బాలాజీ కాలనీలోని ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి నివాసంలో ఉదయం 10.45 గంటలకు మీడియా సమావేశం.
- వేమన విజ్ఞాన కేంద్రంలో సాయంత్రం 4.30 గంటలకు ఆర్‌సీ కృష్ణస్వామి రాజు రచించిన 'గరం గరం చాయ్' కథల పుస్తకం ఆవిష్కరణ.

వేడుకగా స్వర్ణ గొడుగు ఉత్సవం



మాడవీధుల్లో గొడుగు ఊరేగింపు

తిరుమల : శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా కల్యాణకట్ట భవనంలో మంగళవారం బంగారు గొడుగు ఉత్సవం నిర్వహించారు. టీటీడీ బోర్డు సభ్యుడు శాంతా రామ్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, కల్యాణకట్ట డిప్యూటీ ఈఓ పి.వెంకటయ్య, ఏఈఓ సీఏ అమరనాథ్, సూపరింటెండెంట్ జి.శ్రీధర్ పాల్గొన్నారు.

ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంక్ సాధనపై అవగాహన



మాట్లాడుతున్న విశ్రాంత రిజిస్ట్రార్ సిద్ధయ్య

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వైద్యకళాశాలలో మంగళవారం స్విమ్స్ వర్సిటీ జాతీయ సంస్థాగత ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌ఐఆర్‌ఎఫ్) సాధనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్వీయూ విశ్రాంత రిజిస్ట్రార్ టి.సిద్ధయ్య మాట్లాడుతూ స్విమ్స్ యూనివర్సిటీ ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్ సాధించాలంటే మౌలిక వసతుల కల్పన, పరిశోధనా రంగాలలో రాణించాలని సూచించారు. అలాగే బోధన, అభ్యాసం, వనరులు, పరిశోధన, వృత్తిపరమైన పద్ధతులు, గ్రాడ్యుయేషన్ ఫలితాలు, అవుట్‌రీచ్ ఇన్‌క్లూజివిటీ, ప్రతిభ కొలమానంగా ర్యాంకింగ్ ఇస్తారని వివరించారు. వీసీ ఆర్‌వీ కుమార్, డీన్ అలోక్ సచిన్, మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఉషా కళావత్, మెడిసిన్ విభాగాధిపతి అల్లాడి మోహన్ పాల్గొన్నారు.

పాత స్థలంలోనే కొత్త బస్టాండ్



ఉత్తమ మెకానిక్‌ను సత్కరిస్తున్న ఈడీ చెంగల్‌రెడ్డి

తిరుపతి అర్బన్ : మల్టీ మోడల్ బస్టాండ్‌ను మరోచోట నిర్మిస్తారనే ప్రచారంలో వాస్తవం లేదని, ప్రస్తుత పాత స్థలంలోనే కొత్త బస్టాండ్ ఏర్పాటవుతుందని ఆర్టీసీ ఈడీ చెంగల్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం సెంట్రల్ బస్టాండ్‌లో మెకానిక్‌లతో సమీక్షించారు. బస్సుల కండిషన్ కేవలం మెకానిక్‌లు, డ్రైవర్ల చేతుల్లోనే ఉంటుందని తెలిపారు. తిరుపతిలో ప్రతిరోజూ బ్రహ్మోత్సవం జరిగినట్టుగానే పనిచేయాల్సి ఉంటుందన్నారు. స్త్రీశక్తి పథకం కింద నడుపుతున్న సర్వీసుల్లో లోటుపాట్లను సరిచేసుకోవాలని సూచించారు. ప్రయాణికుల నుంచి వచ్చే ఫిర్యాదులకు అధికారులు తప్పనిసరిగా స్పందించాలని ఆదేశించారు. బస్టాండ్‌లో ఎమ్మార్పీ ధరలకే వస్తువులను విక్రయించాలని స్పష్టం చేశారు. లేకుంటే చర్యలు తీసుకోవాలని కోరారు. త్వరలోనే కొత్త బస్టాండ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నట్లు వివరించారు. అనంతరం ఉత్తమంగా సేవలందిస్తున్న మెకానిక్‌ను సత్కరించారు. డీపీటీఓ జగదీష్, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ విశ్వనాథం, డిప్యూటీ చీఫ్ మెకానిక్ ఇంజినీర్ బాలాజీ, తిరుపతి డీఎం సురేంద్రబాబు పాల్గొన్నారు.

విభజనకు చంద్రబాబే కారణం



మాట్లాడుతున్న చింతామోహన్

తిరుపతి కల్చరల్ : రాష్ట్ర విభజనకు చంద్రబాబే కారణమని, దళితుల మధ్య చిచ్చు పెట్టినందుకే సమైక్యాంధ్రను రెండు ముక్కలు చేశారని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ ఆరోపించారు. రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ కేంద్రం, రాష్ట్రంలో దగాకోరు పాలన సాగిస్తున్నారని విమర్శించారు. వర్గీకరణ, క్రిమిలేయర్‌కు వ్యతిరేకంగా మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కుప్పం నుంచి చేపట్టిన రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర మంగళవారం తిరుపతికి చేరుకుంది. ఈ సందర్భంగా బాలాజీ కాలనీలోని పూలే విగ్రహం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు తన రాజకీయ స్వార్థం కోసం మాల, మాదిగల మధ్య చిచ్చు పెట్టారన్నారు. దళిత విభజనతో మోదీ, చంద్రబాబు చిక్కుల్లో పడతారని హెచ్చరించారు. నేతలు అశోక్‌బాబు, వి.శ్రీనివాసరావు, సుదర్శన్, మల్లారపు మధు, ప్రభాకర్, కృష్ణయ్య, మురళి, గోపి, శోభ, రవి, వెంకటేష్, క్రాంతి పాల్గొన్నారు.

సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌గా 'శబరి'

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : శబరి ఎక్స్‌ప్రెస్ రైలును మంగళవారం నుంచి సూపర్‌ఫాస్ట్‌గా అప్‌గ్రేడ్ చేశారు. సూపర్ ఫాస్ట్ చార్జీల రూపేణా జనరల్ సెకండ్ క్లాస్ టికెట్‌కు రూ.15, స్లీపర్, ఏసీ తరగతుల టికెట్లపై రూ.30 నుంచి 40వరకు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. నిత్యం రద్దీగా ఉండే ఈ రైలు కొత్త మార్పులతో రెండు గంటల ముందే ప్రయాణికులను గమ్య స్థానాలకు చేర్చనుంది.

ప్రాపర్టీ అండ్ రైట్స్‌పై అవగాహన



సదస్సులో అధికారులు

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : నగరంలోని బ యో రీసెర్చ్ సెంటర్‌లో మంగళవారం ఏపీఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, క్లౌడ్ టీమ్ ఆర్గనైజేషన్ సహకారంతో ప్రాపర్టీ అండ్ రైట్స్‌పై అవగాహన కల్పిస్తూ వర్క్‌షాప్ నిర్వహించారు. డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, ఏపీఎఫ్ఎస్ ఈడీ సతీష్, డీఐసీ ఐపీఓ హరికృష్ణ, కేవీఐబీ ఏడీ వెంకట్రావ్, సెట్విన్ సీఈఓ మురళీకృష్ణ, డీఆర్పీ ప్రసాద్, యూనియన్ బ్యాంకు మేనేజర్ ప్రసాద్, విట్ ప్రొఫెసర్ జానకిరామయ్య, క్లౌడ్ టీం ఆర్గనైజేషన్ డైరెక్టర్ రామిరెడ్డి పాల్గొన్నారు.

అల్ట్రా వయోలెట్ ఎలక్ట్రికల్ స్కూటర్ ఆవిష్కరణ



స్కూటర్‌ను ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్ : రేణిగుంట రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన యూవీ స్పేస్ స్టేషన్ షోరూమ్‌లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన అల్ట్రావయోలెట్ ఎలక్ట్రికల్ స్కూటర్‌ను మంగళవారం ఆ సంస్థ సీనియర్ ఉపాధ్యక్షుడు గజానన ఉమరేకర్, డెలివర్ ప్రిన్సిపల్ సుధాకర్ ఆవిష్కరించారు. ముందుగా యూవీ స్పేస్ స్టేషన్ షోరూమ్ ఆరంభించి అనంతరం నూతన ఎలక్ట్రికల్ స్కూటర్‌ను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ అల్ట్రావయోలెట్ ఎక్స్–47, ఎఫ్ 77 మాచ్2, ఎఫ్77 సూపర్ స్ట్రీట్ మూడు రకాల ఎలక్ట్రికల్ స్కూటర్లను మార్కెట్‌లోకి తీసుకువచ్చామన్నారు. టైప్ 6తో డీసీఫాస్ట్, టైప్ 2తో ఏసీ కార్ చార్జింగ్ సౌకర్యం ఉందని, ఒక సారి రీచార్జ్ చేసుకుంటే 323 కిలోమీటర్లు ప్రయాణించవచ్చని వివరించారు. ఈ స్కూటర్ ధర రూ.2.74 లక్షలని, ప్రారంభం ఆఫర్‌గా రూ.2.49 లక్షలకు అందిస్తున్నట్లు వివరించారు. ఆసక్తిగల వారు రూ.999లు చెల్లించి వెబ్‌సైట్ లేదా షోరూమ్ ద్వారా బుక్ చేసుకుంటే ఈనెల 22వ తేదీ నుంచి స్కూటర్ డెలివరీ చేస్తామని తెలిపారు.